



# మన దునియా

Our News Our World

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాల్లో సంచలనాలు సృష్టిస్తున్న

మన దునియా

ఇంకెందుకు ఆలస్యం...
9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 237 | మార్చ్ 14 శనివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# యుద్ధం కోసం భారీగా వ్యయం

- తొలి వారం ఖర్చు 11 బిలియన్ డాలర్లకు పైనే!
- అమెరికాకు ఆర్థికంగా తీవ్ర భారం
- భారీ ఆయుధ వినియోగంతో తడిసి మోపెడవుతున్న ఖర్చు
- 'చిన్న' ఆయుధాలతో పొదుపుగా ఇరాన్



## రైతులకు శుభవార్త.. రైతు భరోసాపై ప్రభుత్వం కీలక ప్రకటన.. బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడేది ఈ తేదీల్లోనే

### రైతు భరోసా పథకంపై కీలక అప్డేట్

### ఈనెలాఖరులో రైతుల ఖాతాల్లోకి నిధులు

### రెండు విడతల్లో నిధులు పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు

**మన దునియా,హైదరాబాద్: మార్చి13**

రైతులకు పంటల సాగు సమయంలో ఆర్థికంగా అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ప్రతీయేటా రెండు విడతల్లో ఎకరాకు రూ. 6వేల చొప్పున నిధులు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే.అయితే, రబీ సీజన్‌కు సంబంధించి జనవరిలో రైతు భరోసా




## వంట గ్యాస్‌పై ఆందోళన... కేంద్రమంత్రికి కేటీఆర్ విజ్ఞప్తి



పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో, ఎల్పీజీ సిలిండర్ల కొరతపై వెంటనే జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరికి లేఖ రాశారు. గృహ అవసరాల కోసం ఎల్పీజీ సిలిండర్ల కొరతను సమన్వయంతో పునరుద్ధరించాలని కోరారు.

## పీఎం కిసాన్ దరఖాస్తు చేసుకోవాలంటే అర్హతలు.. కొత్తవారికి అవకాశం ఉందా? ఈ కార్డు ఉంటేనే!

**మన దునియా,న్యూఢిల్లీ:మార్చి 13**




ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా దేశవ్యాప్తంగా 9 కోట్ల మందికి పైగా రైతులు లబ్ధి పొందుతున్నారు. అయితే, ఈరోజు మార్చి 13న 22వ విడుత నిధులు అసోంలోని గువహటీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారు.ఈ నేపథ్యంలో కొత్తగా పీఎం కిసాన్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే ఏ అర్హతలు ఉండాలి? వాటి నియమాలు

## సంగెం భూ మాయ - 3

- భూదాన్ భూములంటే ఇంత అలుసా
- అన్యాక్రాంతమైనా ఆటవిడుపేనా
- 'సంగెం' భూదాన్ భూములపై అధికారుల మౌనం
- ఎవరికోసం ఈ మెహర్బానీ
- కోట్ల రూపాయల భూ బాగోతంపై శీత కన్ను
- లిఖిత పూర్వక ఫిర్యాదులున్నా స్పందన సున్నా

రియల్టర్ల ధనదాహానికి అధికారుల కక్కుర్తి..?



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# సంగెం భూ మాయ - 3

**మన దునియా,రంగారెడ్డి జిల్లా కేశంపేట,సంగెం:మార్చి13**

పేద ప్రజలకు ఉండాల్సిన భూములను గద్దల్లా పెద్దలు తన్నుకు పోతుంటే చోద్యం చూస్తున్న వారే తప్పిస్తే అడ్డుకోడానికి ప్రయత్నించేవారు ఏ ఒక్కరు లేకపోవడం విడ్డూరకరమైన విషయం. బడా వ్యాపారులు, రియల్టర్ల ధనదాహానికి అధికారుల కక్కుర్తి తోడవడంతో ఎంతో ఆశయంతో పేదలకు పంచిన భూదాన్ భూములు ఒక్కొక్కటిగా చేతులు మారుతూ అన్యాకాంతమవుతున్నాయి. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం సంగెం గ్రామంలోని భూస్వామి ఇక్రమ్ అలీ ఖాన్ గొప్ప ఆశయంతో తనకున్న భూమి నుండి కొంత భాగాన్ని పేదలకు పంచాలని గ్రామంలోని సర్వే నెంబర్ 32 నందు భూథాన్ యజ్ఞ బోర్డుకు సమర్పించాడు. అలా భూములను స్వాధీనం చేసుకున్న భూదాన్ బోర్డు గ్రామంలోని రైతులకు సాగు చేసుకుని జీవనం సాగించాలని కేటాయించింది. కాలక్రమేన పేద రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని అమ్మడానికి కొనడానికి వీలులేని, వీలు పడని ఈ భూదాన్ భూములను డబ్బున్న వ్యాపారులు, పెద్దలు తమ పలుకుబడి ఉపయోగించి ఏకంగా రిజిస్టర్ చేసుకోవడం కాకుండా రికార్డులో కూడా తమ పేర్లపై మార్చుకున్నారు. ఇంకొందరైతే ఏకంగా అవి సాగు పనికిరాని భూములను నాలాకన్వర్షన్ కూడా చేయించారు. ఇటీవలే సంగెం గ్రామంలోని 32/7 సర్వే నెంబర్ లో 10–29 గుంటల భూమి అన్యాక్రాంతం అయిందని పెద్ద ఎత్తున సాక్షాదారాలతో సహా పత్రికల్లో, సోషల్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పేద ప్రజల నుండి చేతులు మారిన ఆ భూమిలో దిండి గోదావరి సంస్థ రిసార్టులను ఏర్పాటు చేసేందుకు పూర్తిగా పథకం రచించినట్లు స్పష్ట మవుతుంది. రెవెన్యూ రికార్డుల్లో భూమి అని చూపుతున్నా కాసుల వేటలో ఉన్న కొందరి అధికారుల కారణంగా అక్రమ కన్వర్షన్, పేరు మార్పిడి జరిగిపోయాయనే ఆరోపణలున్నాయి. ఈ భూ బాగోతం విషయంలో పెద్ద ఎత్తున కథనాలు వచ్చినప్పటికీ ప్రస్తుతం రెవెన్యూ యంత్రాంగంలో పనిచేస్తున్న అధికారులు నోరు మెదపక పోవడం వెనక సర్వత్రా విమర్శలు వెల్లడవుతున్నాయి. కోట్ల రూపాయల విలువైన భూములు పక్కదారి పడుతున్నాయంటే కూడా అధికార యంత్రాంగం చలించకుండా ఎందుకు ఉంటుందని, కనీసం విచారణ చేయక పోవడం వెనక ఏం మతలబు దాగుందనే ప్రశ్నలు వేల్లడవుతున్నాయి. సంగెం గ్రామంలోని ఈ భూదాన్ భూములపై గత సంవత్సరం సెప్టెంబర్ నెలలోనే షాద్ నగర్ రెవెన్యూ డివిజనల్ అధికారికి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఆర్డీవో కు ఫిర్యాదు చేసి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ అధికార యంత్రాంగం మాత్రం పట్టనట్లు వ్యవహరించినట్లు తెలుస్తుంది. భూదాన్ భూములు అన్యాకాంతం అయ్యాయని ఆధారాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు మాత్రం షరా మామూలే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల మౌనం వెనుక బడా వ్యాపారుల హస్తం దాగి ఉందా...? లేక ఆర్థిక లావాదేవీల వ్యవహారం ఏమైనా ఉందా ? అంటూ స్థానికంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రజల ఆరోపణలకు అద్దం పట్టినట్లుగానే అధికారుల వ్యవహారం ఉండటంతో సంగెం గ్రామంలోని భూదాన్ భూముల వ్యవహారంలో పెద్ద ఎత్తున లాబీయింగ్ జరిగినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే గ్రామంలోని 32 సర్వే నెంబర్ లో ప్రస్తుతం దిండి బై గోదావరి రిసార్ట్స్ పేరుతో ఉన్న భూదాన్ భూములతో పాటు అదే సర్వే నెంబర్ లో ఉన్న మరిన్ని భూదాన్ భూములు కూడా ఇదే విధంగా పక్కదారి పట్టినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా స్థానికుల, బాధిత రైతుల సమాచారం మేరకు రోజుకో ఆసక్తికరమైన విషయాలు, అక్రమాలు బయట పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది..

## వంట గ్యాస్‌పై ఆందోళన... కేంద్రమంత్రికి కేటీఆర్ విజ్ఞప్తి

**(మొదటి పేజీ తరువాయి)**

గ్యాస్ కొరత కారణంగా హోటళ్లు, హాస్టళ్లు ఎదురొంటున్న సంక్షోభ నివారణకు తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.గ్యాస్ సరఫరాను పునరుద్ధరించకపోతే హైదరాబాద్ సహా తెలంగాణవ్యాప్తంగా దాదాపు 90 శాతం హోటళ్లు, రెస్టారెంట్లు 48 గంటల్లో మూతపడే ప్రమాదం ఉందని రాష్ట్రంలోని హోటల్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. గ్యాస్ కొరత కారణంగా హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పీజీ హాస్టళ్లలో నివసించే లక్షలాది మంది విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు భోజనానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.గ్యాస్ కేటాయింపుల్లో పెద్ద పెద్ద సంస్థల కంటే చిన్న చిన్న వ్యాపారులు, సంస్థలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ సంక్షోభం ముగిసేవరకు వాణిజ్య సిలిండర్ల ధరలు పెరగకుండా నియంత్రించాలని విజ్ఞప్తి చేశారు. గ్యాస్ లభ్యతపై ప్రజల్లో ఉన్న అయోమయాన్ని తొలగించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఇందుకోసం జిల్లాస్థాయి పంపిణీ వివరాలతో కూడిన పబ్లిక్ డ్యాష్ బోర్డును అందుబాటులోకి తేవాలన్నారు. గృహ అవసరాల కోసం రావాల్సిన సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆ లేఖలో కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. హోటల్ రంగంపై 80 లక్షలమంది దినసరి కూలీలు ఆధారపడి బతుకుతున్నారని, వారికి ఉపాధికి గ్యారెంటీ ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం మాటలతో సరిపెట్టకుండా తక్షణమే క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## సమ్మె నోటీసు ఇచ్చిన తెలంగాణ ఆర్టీసీ జేఏసీ




తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంలో చేయడంతో పాటు వివిధ డిమాండ్లపై కార్మికులు ఈ నోటీసు ఇచ్చారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళతామని హెచ్చరించారు. సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆర్టీసీ జేఏసీ తెలిపింది. ఆర్టీసీ ఎండీ అందుబాటులో లేకపోవడంతో పేషీలో నోటీసులు ఇచ్చింది. లేబర్ కమిషనర్ కార్యాలయంలోనూ నోటీసులు ఇచ్చింది.2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని ఆర్టీసీ జేఏసీ కోరింది. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలని, పాత బకాయిలు రూ.2,500 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

# రైతులకు శుభవార్త.. రైతు భరోసాపై ప్రభుత్వం కీలక ప్రకటన.. బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడేది ఈ తేదీల్లోనే

**(మొదటి పేజీ తరువాయి)**

నిధులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో వేస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ.. ఆలస్యం అవుతూ వస్తోంది. దీంతో రైతు భరోసా నిధుల కోసం గత కొన్ని నెలలుగా తెలంగాణ అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.. అయితే, ప్రభుత్వం తాజాగా రైతు భరోసా నిధుల విడుదలపై కీలక అప్డేట్ ఇచ్చింది.తెలంగాణ కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి రైతు భరోసా నిధుల విడుదలకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. అన్నదాతల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. మొత్తం రూ.9వేల కోట్ల రైతు భరోసా నిధులను అర్హులైన రైతుల అకౌంట్లలో జమ చేయనున్నట్లు తెలిపారు. అయితే, ఈ నిధులను రెండు విడతల్లో పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెలాఖరులోగా రూ.4500 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని.. మిగిలిన రూ.4500 కోట్ల నిధులను వచ్చే నెలలో మిగిలిన రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని మంత్రి వివేక్ వెంకట స్వామి పేర్కొన్నారు.ప్రతీసారి రైతు భరోసా పథకం కింద నిధులను రైతుల ఖాతాల్లో దశల వారీగా ప్రభుత్వం జమ చేస్తోంది. తొలుత ఎకరం నుంచి రెండు ఎకరాలు కలిగిన రైతులకు.. ఆ తరువాత నాలుగు ఎకరాలలోపు.. ఆ తరువాత ఐదు ఎకరాల వరకు కలిగిన రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రైతు భరోసా నిధులను జమ చేస్తోంది. ఈ సారి రబీకి సంబంధించిన రైతు భరోసా నిధులను ఈ నెలా చివరి వారంలో మూడు ఎకరాల లోపు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. నాలుగు, ఐదు ఎకరాలలోపు రైతులకు ఏప్రిల్ నెల మొదటి వారం లేదా రెండో వారంలో జమ చేస్తారని ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతుంది.రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు రైతులతో కలిసి ఆందోళనలు నిర్వహించాయి. రైతు భరోసా పథకం నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రైతుల ఖాతాల్లో ఒకేసారి కాకుండా.. దఫాల వారిగా రెండు లేదా మూడు విడతల్లో రైతు భరోసా నిధులు జమ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# పీఎం కిసాన్ దరఖాస్తు చేసుకోవాలంటే అర్హతలు.. కొత్తవారికి అవకాశం ఉందా? ఈ కార్డు ఉంటేనే!

**(మొదటి పేజీ తరువాయి)**

ఏంటి ఆ పూర్తి సమాచారం తెలుసుకుందాం.2019లో ప్రధాన మంత్రి మోదీ ఈ పథకాన్ని ప్రారంభించారు. ప్రతి ఏడాది ఈ పథకం ద్వారా రూ.6000 రైతుల ఖాతాల్లో నేరుగా జమా అవుతున్నాయి. మూడు విడుతల్లో ఈ నిధులు రూ.2000 చొప్పున విడుదల చేస్తారు.

9 కోట్ల మంది రైతులకు లాభం..

ఈ పీఎం కిసాన్ పథకం ద్వారా అధికారిక వెబ్‌సైట్ https://pmkisan.gov.in/ ప్రకారం 9 కోట్ల మందికి పైగా రైతులు లబ్ధి పొందుతున్నారు. ఇందులో మహిళా రైతులు 2.15 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. ఈ పీఎం కిసాన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రూ.4.25 లక్షల కోట్లకు చేరింది. 2025 నవంబర్ నెలలో తమిళనాడులోని కోయంబత్తూర్‌లో గత విడుత విడుదల చేశారు. ఇందులో 9 కోట్ల మందికి పైగా రైతులు రూ.18000 కోట్లు పొందారు.

ఈకేవైసీ పూర్తి చేస్తేనే..

పీఎం కిసాన్ నిధులు పొందాలంటే ముందుగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి. వ్యవసాయ శాఖ కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకారం అధికారిక వెబ్‌సైట్ ద్వారా అర్హులైన రైతులందరూ ఈకేవైసీ పూర్తి చేయాలి. అప్పుడే రైతుల ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా జమ అవుతాయి..

ప్రధానమంత్రి కిసాన్‌లో మీ స్టేటస్ చెక్ చేయండి..

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా మీరు మీ స్టేటస్ కూడా చెక్ చేసుకోవచ్చు. లబ్దిదారుల స్టేటస్ చెక్ చేసుకోవచ్చు. ఈ అధికారిక వెబ్‌సైట్‌లోనే మీరు సులభంగా పేమెంట్ స్టేటస్, అర్హత, ఆధార్ లింకింగ్, ఈకేవైసీ పనులు కూడా పూర్తి చేసుకోవచ్చు.బిఅధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే కాదు.. మొబైల్ అప్లికేషన్ ద్వారా కూడా ఈకేవైసీ పూర్తి చేయవచ్చు. ఓటీపీ వెరిఫికేషన్‌తోపాటు బయోమెట్రిక్ కూడా చేసుకోవచ్చు

ఎల్‌పీజీ.. సీఎన్‌జీ ఎలా తయారు చేస్తారు? పూర్తి ప్రక్రియ ఎలా ఉంటుంది? తెలుసుకోండి..

ఏఐ సహాయంతో..

కిసాన్ ఇమిత్ర ద్వారా ఏఐ సహాయంతో దేశవ్యాప్తంగా 11 స్థానిక భాషల్లో చాట్‌బాట్ ద్వారా లక్షల మంది సమస్యలకు పరిష్కారం చూపారు. ఈ పథకానికి ఫార్మర్ ఐడీ కూడా తప్పనిసరి చేశారు. అధికారిక వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.

స్టేటస్ చెక్ చేసుకునే విధానం..

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన స్టేటస్ చెక్ చేసుకోవాలంటే అధికారిక వెబ్‌సైట్ https://pmkisan.gov.in/ ఓపెన్ చేసి ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. అందులో స్టేట్, జిల్లా, సబ్ డిస్ట్రిక్, బ్లాక్, గ్రామం వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత క్లిక్ చేయాలి. అప్పుడు అధికారిక వెబ్‌సైట్‌లో గ్రామాలవారీగా వివరాలు మీ స్క్రీన్‌పై కనిపిస్తుంది. 2026 ఫిబ్రవరి 24వ తేదీ నాటికి పీఎం కిసాన్ పథకం ప్రారంభించి 7 ఏళ్లు పూర్తవుతుంది.

# యుద్ధం కోసం భారీగా వ్యయం

**మన దునియా ఇంటర్నేషనల్ డెస్క్:మార్చి 13**

వాషింగ్టన్ : ఇరాన్‌పై అమెరికా చేపట్టిన సైనిక చర్యతో మొదటి వారంలోనే 11.3 బిలియన్ డాలర్లు ఖర్చు అయినట్టు పెంటగాన్ అంచనా వేసింది. అమెరికా– ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఖర్చు మరింతగా పెరిగే అవకాశం ఉందని అమెరికాలోని అధికారిక వర్గాలు చెప్తున్నాయి. ఇది అమెరికాకు ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని విశ్లేషకులు చెప్తున్నారు. మరోపక్క ఇరాన్ మాత్రం తక్కువ ఖర్చుతో కూడుకున్న ఆయుధాలను వాడుతోందనీ, వాటిని అడ్డుకోవడానికి అమెరికా పెద్ద ఎత్తున ఖర్చు చేస్తోందని వివరిస్తున్నారు.

ఏఐతో లక్ష్యాలు గుర్తింపు

అమెరికా, ఇజ్రాయిల్‌లు కలిసి ఇరాన్ సైనిక స్థావరాలు, లీడర్లే టార్గెట్‌గా పెద్ద ఎత్తున దాడులు ప్రారంభించిన విషయం విదితమే. ఫలితంగా అమెరికాకు ఆర్థికంగా తీవ్ర వ్యయం ఏర్పడిందని నివేదికలు చెప్తున్నాయి. ఇప్పటి వరకు అమెరికా సైన్యం 5500కు పైగా లక్ష్యాలపై దాడులు చేసినట్టు కమాండర్లు తెలిపారు. ఈ లక్ష్యాలను గుర్తించడం కోసం అమెరికా కృత్రిమ మేధస్సు (ఏఐ)ని కూడా ఉపయోగించినట్టు వెల్లడించారు.

రెండు రోజుల్లోనే 5.6 బిలియన్ డాలర్లు

యుద్ధం ప్రారంభమైన తొలి రెండు రోజుల్లోనే అమెరికా సుమారు 5.6 బిలియన్ డాలర్ల విలువైన ఆయు ధాలు వినియోగించినట్టు సమాచారం. ముఖ్యంగా ఏజీఎం –154 జాయింట్ స్టాండాఫ్ వెపన్ (జేఎస్ఓడబ్ల్యూ) వంటి ఖచ్చితమైన బాంబులు ఉపయోగించనట్టు తెలుస్తోంది. ఒక్క దానికి సుమారు 2.8 లక్షల నుంచి 7 లక్షల డాలర్ల వరకు ఖర్చవుతందని అంచనా. అలాగే అమెరికా పాట్రియాట్, 'థాడ్' క్షిపణి రక్షణ వ్యవస్థలను ఉపయోగించి ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఇంటర్‌సెప్టార్ క్షిపణులు ఒక్కోటి మిలియన్ డాలర్ల ఖర్చవుతాయని తెలుస్తోంది.

యుద్ధం కొనసాగితే అదనంగా 50 బిలియన్ డాలర్లు అవసరం

కాగా యుద్ధం కొనసాగితే అమెరికా ప్రభుత్వం కాంగ్రెస్‌ను సంప్రదించి సుమారు 50 బిలియన్ డాలర్ల అదనపు నిధులు కోరే అవకాశం ఉందని అధికారిక వర్గాలు చెప్తున్నాయి. ఇక ఈ యుద్ధంలో ప్రాణ నష్టం కూడా పెరుగుతోంది. ఇరాన్ రెడ్ క్రెసెంట్ సమాచారం ప్రకారం... అమెరికా–ఇజ్రాయిల్ దాడులు ప్రారంభమైన తర్వాత ఇరాన్‌లో 1300 మందికి పైగా మరణించారు. అయితే అమెరికా, ఇజ్రాయిల్‌లు మాత్రం తమ దగ్గర నమోదైన మరణాల సంఖ్యను మాత్రం బటయకు రానివ్వడం లేదు. ఈ మేరకు మీడియాను తన గుప్పెట్లో పెట్టుకుంటూ, తమకు అనుకూల ప్రచారాలను కొనసాగించేలా ట్రంప్ వ్యవహరిస్తున్నారని విశ్లేషకులు చెప్తున్నారు. అయితే యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే ఆర్థిక వ్యయం మాత్రమే కాకుండా మానవ నష్టం కూడా భారీగా పెరిగే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

ఇరాన్ ఆర్థిక క్రమశిక్షణ

ఇరాన్ మాత్రం అమెరికాకు భిన్నంగా, ఒక వ్యూహాత్మక పద్ధతిలో ముందుకెళ్తోంది. తక్కువ ఖర్చుతో తయారయ్యే షాహెద్ డ్రోన్లు ఉపయోగిస్తోంది. ఒక్కో డ్రోన్ తయారీకి ఖర్చయ్యేది వేల డాలర్లు మాత్రమే. అయితే వాటిని కూడా అడ్డుకోవడానికి అమెరికా మిలియన్ డాలర్ల విలువైన క్షిపణులను వినియోగించాల్సి వస్తోందని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ విషయంలో ఇరాన్ ఒక ఆర్థిక క్రమ శిక్షణను పాటిస్తోందని వివరిస్తున్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
మార్చ్ । శనివారం । 14 । 2026



# తెలంగాణకు వడగండ్ల గండం.. మార్చి 15 నుంచి నాలుగు రోజులు వానలు

**ఆదివారం 18 జిల్లాలు.. సోమవారం 32 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

**భద్రాచలం, మహబూబ్నగర్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**

**ఎల్లుండి నుంచి నాలుగు రోజుల పాటు వానలు**

**మన దునియా,హైదరాబాద్: మార్చి13**

హైదరాబాద్ : రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వడగండ్ల వానలు పడే అవకాశముంది. ఆదివారం నుంచి మంగళవారం వరకు రాష్ట్రమంతటా విస్తారంగా వర్షాలు పడుతాయని, కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలకు చాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆదివారం 18 జిల్లాలు.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డికి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సోమవారం ఆయా జిల్లాలతో పాటు మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్కర్నూల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మొత్తంగా ఆరోజు 32 జిల్లాల్లోనూ వర్షాలు పడుతాయని తెలిపింది. మంగళ, బుధవారాలకు ఎలాంటి అలర్ట్ జారీ చేయకపోయినా.. పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అలర్ట్ జారీ చేసిన రోజుల్లో మాత్రం వడగండ్లు పడే ప్రమాదం ఎక్కువగా ఉందని హెచ్చరించింది.




**రెండు జిల్లాల్లో 40 డిగ్రీలు**

రాష్ట్రంలో టెంపరేచర్లు పెరుగుతున్నాయి. గురువారం 2 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కు దాటాయి. భద్రాచలంలో గరిష్టంగా 40.2 డిగ్రీల టెంపరేచర్ నమోదైంది. మహబూబ్నగర్లోనూ 40 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఆదిలాబాద్లో 39.3, ఖమ్మంలో 39, నిజామాబాద్లో 38.8, రామగుండంలో 38, హైదరాబాద్లో 37.2 చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, రాష్ట్రంలో వర్షాలతో పాటే ఎండలు కూడా తీవ్రమవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

**రోడ్డు భద్రత, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**మన దునియా,రామగుండం: మార్చి13**

ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత,"మత్తు పదార్థాల వినియోగం--అనర్థాలు",సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన గోదావరిఖని వన్టౌన్ పోలీస్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్లో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత,"మత్తు పదార్థాల వినియోగం--అనర్థాలు",సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా గోదావరిఖని వన్టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పోలీస్ కమిషనర్కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డీసీపీ మాట్లాడుతూ,మత్తు పదార్థాలకు బానిసలైతే ఎవరి భవిష్యత్తైనా నాశనం అవుతుందని తెలిపారు.ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని సూచించారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని,ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకుని తమ ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్థులు తమలో ఉన్న అపారమైన శక్తిని సరైన దిశలో వినియోగించుకోవాలని తెలిపారు. యువతలో సహజంగా ఉన్న ఉత్సాహం,శక్తిని క్రీడలు,చదువు మరియు సమాజ అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ వయసులో శారీరకంగా, మానసికంగా ఎక్కువ శక్తి ఉంటుందని,ఆ శక్తిని మత్తు పదార్థాల వైపు మళ్లిస్తే ముందుగా ఆరోగ్యం దెబ్బతింటుందని, తరువాత జీవితమే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా దూరం పెట్టాలని, ఎవరికైనా అలాంటి అలవాటు ఉన్నట్లు తెలిసితే ముందుగా వారిని మార్చే ప్రయత్నం చేయాలని, మార్పు రాకపోతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.మత్తు పదార్థాల అక్రమ రవాణా,వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.అలాగే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా యువతలోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు.నివేదికల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో 60 నుంచి 70 శాతం వరకు యువకులే బాధితులవుతున్నారని తెలిపారు.వాహనం నడిపేటప్పుడు



తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కారును నడిపే సమయంలో సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. ఎప్పుడూ రహదారి ఎడమ వైపునే ప్రయాణించాలని, భారీ వాహనాలను దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని హెచ్చరించారు.సైబర్ నేరాల విషయంలో కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు అడగడం, అనుమానాస్పద లింకులు పంపడం వంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.గతంలో తల్లిదండ్రులు అపరిచితులు ఇచ్చే చాక్లెట్లను తీసుకోవద్దని చెప్పేవారని,ఇప్పుడు అదే మోసం మొబైల్ ఫోన్ ద్వారా వచ్చే లింకులు,మెసేజ్ల రూపంలో జరుగుతోందని వివరించారు.మొబైల్ ఫోన్ ద్వారా ప్రపంచంతో అనుసంధానం సాధ్యమవుతున్నప్పటికీ, అదే సమయంలో సైబర్ నేరస్థులకు కూడా అవకాశం కలుగుతుందని చెప్పారు.అందువల్ల ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్ను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని,అప్రమత్తంగా ఉంటేనే నేరాల నుంచి రక్షణ పొందగలమని సూచించారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి పోలీస్ కళాబృందం పాటల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ డ్రగ్స్ వినియోగం--అనర్థాలపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ప్రవచనకర్త ఎస్.పి. నాయక్ బంజారా, గోదావరిఖని వన్టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, గోదావరిఖని వన్టౌన్ ఎస్ఐలు రమేష్, అనూష,పోలీస్ సిబ్బంది మరియు సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# కారులోకి చెరువు: కేసు నమోదు..

**షాద్ నగర్ సీఐ కె. సీతారాం వెల్లడి**

**కారును బయటకు తీసిన పోలీసులు, డిఆర్ఎఫ్ బృందం..**

**మద్యం మత్తులో నిర్లక్ష్యం వల్లనే చెరువులోకి**

**మన దునియా,షాద్ నగర్:మార్చి 13**

మద్యం మత్తులో నిర్లక్ష్యంగా కారు నడపడంతో అది చెరువులోకి వెళ్లిపోయిన సంఘటన షాద్ నగర్ పురపాలక పరిధిలోని చటాన్ పల్లి సురసముద్రం చెరువు వద్ద గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. దీనికి సంబంధించి చెరువులో గాలింపులు చేపట్టిన పోలీసులు, డిఆర్ఎఫ్ బృందాలు కారును బయటకు తీశారు. కారు నెంబర్ సహాయంతో ఓనర్ వివరాలు తెలుసుకోగా కాజ్జాం రామంత అని తెలిసింది. రంగారెడ్డి జిల్లా బండ్లగూడ జాగిర్ పరిధిలోని ర్యాలీ కాలనీలో నివాసం ఉండే ఆయనకు సమాచారం ఇవ్వగా అతని కారును హైదరాబాద్ అత్తాపూర్ లోని నలంద నగర్ కు చెందిన శ్రీకాంత్ రెడ్డి అభ్యర్థన మేరకు ఇచ్చినట్లు తెలిపారు. కాగా శ్రీకాంత్ రెడ్డి, నరేష్లు మద్యం తాగి కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లనే చెరువులో పడి పూర్తిగా డ్యామేజ్ అయింది. అయితే ఇందులో ప్రాణ నష్టం జరగలేదు. యజమాని రామంత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు పట్టణ సిఐ కె సీతారాం మీడియాకు తెలిపారు..




# పకోడీ తెమ్మన్న భార్య... వచ్చేసరికి మాయమైపోయింది!

**మన దునియా,ఉత్తరప్రదేశ్: మార్చి 13**




ఉత్తరప్రదేశ్లో జరిగిన ఓ వింత ఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బస్టాండ్లో బస్సు కోసం ఎదురు చూస్తుండగా భార్య పకోడీ తీసుకురమ్మని భర్తను పంపింది. భర్త పకోడీ తీసుకుని వచ్చేసరికి ఆమె అక్కడ కనిపించకుండా పోయింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమ్రోహా జిల్లాకు చెందిన ప్రీతమ్ సింగ్ గత ఏడాది డిసెంబర్ 1న రాంపూర్ జిల్లాకు చెందిన రింజిమ్ (18)ను వివాహం చేసుకున్నాడు. ఇటీవల హోలీ పండుగ సందర్భంగా రింజిమ్ తన తల్లిగారి ఇంటికి వెళ్లింది.పండుగ ముగిసిన తర్వాత మార్చి 9న ప్రీతమ్ అత్తగారింటికి వెళ్లి తన భార్యను తీసుకుని తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఇద్దరూ బిలారి బస్టాండ్లో బస్సు కోసం ఎదురు చూస్తున్నారు.ఇంతలో రింజిమ్ ఆకలిగా ఉందని చెప్పి పకోడీలు తీసుకురమ్మని భర్తను కోరింది. దీంతో ప్రీతమ్ పకోడీలు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. ఇదే సమయంలో రింజిమ్ అక్కడి నుంచి పరారైంది.పకోడీలు తీసుకుని తిరిగి వచ్చిన ప్రీతమ్కు భార్య కనిపించకపోవడంతో బస్టాండ్ మొత్తం వెతికాడు. అయినా ఆమె ఆచూకీ లభించలేదు.దీంతో అతను పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. తన భార్య ఒక యువకుడితో వెళ్లిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశాడు.కేసు నమోదు చేసిన పోలీసులు బస్టాండ్ పరిసరాల సీసీటీవీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. అలాగే ఆమె మొబైల్ లొకేషన్ను ట్రేస్ చేస్తూ గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

# తెలంగాణలో రేపటి నుంచే టెన్త్ పరీక్షలు..5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి

**మన దునియా,హైదరాబాద్: మార్చి13**



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రేపటి నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ విద్యా సంవత్సరం మొత్తం 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా, వారి కోసం విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా 2,676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది.పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని, కేవలం ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్తో ఉదయం 9.35 గంటల వరకు మాత్రమే విద్యార్థులను హాలులోకి అనుమతిస్తామని అధికారులు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే, ఆఖరి నిమిషం రద్దీని మరియు ఒత్తిడిని నివారించడానికి విద్యార్థులు కనీసం అరగంట ముందే, అంటే ఉదయం 9.00 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచించారు.పరీక్షల నిర్వహణ కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపిన విద్యాశాఖ, మాల్ ప్రాక్టీస్ జరగకుండా ఉండేందుకు సిట్టింగ్ మరియు ఫ్లయింగ్ స్క్వాడ్లను రంగంలోకి దించింది. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేస్తారని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను అధికారిక వెబ్సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చని, హాల్ టికెట్పై ఫోటో సరిగ్గా లేని పక్షంలో ప్రధానోపాధ్యాయుడితో అటెస్టేషన్ చేయించుకోవాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని కేంద్రాలలో తాగునీరు మరియు ప్రాథమిక ఆరోగ్య సదుపాయాలను సిద్ధం చేశారు. నిమిషం ఆలస్యం నిబంధన అమల్లో ఉన్నందున విద్యార్థులు మరియు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

# ప్రతి జిల్లాలో ముదిరాజ్ భవనాల స్థల కేటాయింపులకై ఈ బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలి...

**బి మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ఉ రాష్ట్ర కమిటీ**

**మన దునియా, హైదరాబాద్ మార్చి13**




ప్రతి జిల్లాలో ముదిరాజ్ లకు స్థలం కేటాయించి భవనాలు నిర్మించాలని మెపా ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, రాష్ట్ర కమిటీతో పాటు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు దుండి అశోక్ ముదిరాజ్ మత్స్య పశు సంవర్ధక క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ ను హైదరాబాదులోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ... ప్రతి జిల్లాలో ముదిరాజ్ భవనాలు ఏర్పాటు చేసినట్లయితే .. చదువుకున్న విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని,అలాగే ముదిరాజు విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కొరకు కూడా ఉపయోగించవచ్చు అని అన్నారు.ఎంత చదువు ఉన్నా సరైన శిక్షణ సలహాలు లేకుంటే చదివిన చదువులు నిరర్థకం అన్నారు. అందుకే మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ గారు ఈ విషయంపై ముఖ్యమంత్రి గారితో మాట్లాడి,బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మెపా మహాబూబాబాద్ జిల్లా అధ్యక్షులు దుండి అశోక్ ముదిరాజ్,చెన్న రాములు ముదిరాజ్, బలరాం ముదిరాజ్,పుట్టి రాజు ముదిరాజ్, శ్రీనివాస్,రాజు,రమేష్ లు పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## నేడే అకౌంట్లోకి పీఎం కిసాన్ డబ్బులు.. విడుదల వేళ రైతులకు కేంద్రం అలర్ట్.. మొబైల్స్‌కు మెస్సేజ్‌లు

**మన దునియా,హైదరాబాద్: మార్చి13**



రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పీఎం కిసాన్ సాయం మార్చి 13వ తేదీన అందనుంది. శుక్రవారం అసోంలోని గువహతిలో జరిగే కార్యక్రమంలో ఈ డబ్బులను ప్రధాని నరేంద్ర మోదీ తన చేతుల మీదుగా విడుదల చేయనున్నారు. డబ్బులు విడుదల చేసిన అనంతరం రైతులతో ముచ్చటించడంతో పాటు సభలో మోదీ ప్రసంగించనున్నారు. ఇవాళ సాయంత్రం 5 గంటలకు మోదీ డబ్బులను విడుదల చేయనున్నారు. దీంతో సాయంత్రానికి రైతుల అకౌంట్లలో రూ. 2 వేలు జమ కానున్నాయి. అయితే మోదీ నిధులు విడుదల చేస్తున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం లబ్దిదారుల మొబైల్‌కు ఓ మెస్సేజ్ పంపుతోంది. కేంద్ర వ్యవసాయశాఖ నుంచి ఈ మెస్సేజ్‌లు వస్తున్నాయి. ఈ లింక్ ఓపెన్ చేయండి "ప్రధాని నరేంద్ర మోదీ మార్చి 13న సాయంత్రం 5 గంటలకు పీఎం కిసాన్ 22వ విడత సొమ్మును అస్సాంలోని గౌహతి వేదికగా విడుదల చేయాలని నిర్ణయించారు. https://pmindiawebcast.nic.in/ లింకు ఓపెన్ చేసి వెబ్‌కాస్ట్ ద్వారా మీరు ఈ కార్యక్రమంలో పాల్గొనండి. అందరూ పాల్గొనాలని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాం. మీ శివరాజ్ సింగ్ చౌహన్, కేంద్ర కేబినెట్ మంత్రి వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ" అంటూ లబ్దిదారుల మొబైల్స్‌కు ఎస్ఎంఎస్‌లు వస్తున్నాయి. అయితే ఈ లింక్ ద్వారా లబ్దిదారులతో ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడనున్నారు. కొంతమంది రైతులతో మోదీ నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకోనున్నారు. మోదీతో తమ సమస్యలతో చెప్పుకునే అవకాశం కేంద్రం ఈ విధానంలో కల్పిస్తోంది. అందుకే లబ్దిదారులకు సమాచారం ఇస్తూ ఈ మెస్సేజ్‌లు పంపుతోంది.

2.15 కోట్ల మంది మహిళా రైతులు

దేశవ్యాప్తంగా పీఎం కిసాన్ ద్వారా 2.15 కోట్ల మంది మహిళా రైతులు లబ్ది పొందుతున్నారు. గత ఏడాది నవంబర్‌లో కేంద్రం 21వ విడత నిధులను తమిళనాడు వేదికగా విడుదల చేసింది. ప్రతీ ఏడాది రూ. 9.32 కోట్ల మంది రైతులకు అందిస్తుండగా.. ఇందుకు రూ. 18,640 కోట్లు ఖర్చు పెడుతున్నారు. ప్రతీ ఏడాది రూ. 6 వేల చొప్పున మూడు విడతలుగా అందిస్తోంది. ఈ ఏడాదికి సంబంధించి తొలి విడత నిధులను ఇవాళ విడుదల చేస్తోంది. ప్రతీ ఏడాది తొలి విడత సొమ్మును ఫిబ్రవరిలో జమ చేసేవారు. కానీ ఈ సారి పలు కారణాల వల్ల జాప్యం జరిగింది. పీఎం కిసాన్ లబ్దిదారుల రీవెరిఫికేషన్ ప్రక్రియ కేంద్రం చేపట్టింది. ఇందులో భాగంగా ఈ సారి 1.30 లక్షల మంది అనర్హులను గుర్తించి వారిని లబ్దిదారుల జాబితా నుంచి తొలగించింది. ఈ ప్రక్రియ వల్లనే నిధుల విడుదలలో జాప్యం జరిగింది.

## నేటి నుంచి వాహన రిజిస్ట్రేషన్‌లకు కొత్త విధానం.. పూర్తిగా ఆన్‌లైన్ ప్రక్రియ

**మన దునియా,హైదరాబాద్: మార్చి 13**

హైదరాబాద్: వాహనాల పర్మనెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా చేయడానికి రవాణాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. నేటి (శుక్రవారం) నుంచి వాహన రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి కొత్త విధానం అమలులోకి వచ్చింది. ఇకపై పర్మనెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించనున్నట్లు రవాణాశాఖ అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా ఫిజికల్ పేపర్లు సమర్పించే విధానం అమల్లో ఉండేది. అయితే కొత్త మార్గదర్శకాల ప్రకారం ఇకపై రవాణాశాఖ కార్యాలయాలకు ఫిజికల్ పత్రాలు తీసుకురావాల్సిన అవసరం ఉండదు. అవసరమైన అన్ని పత్రాలను ఆన్‌లైన్‌లోనే సమర్పించే విధంగా వ్యవస్థను రూపొందించారు. కొత్త విధానం ప్రకారం వాహనాలకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ పొందిన తర్వాత గరిష్టంగా ఏడు రోజులలోపు డీలర్లు అవసరమైన పత్రాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. వాహన యజమాని మరియు ఫైనాన్షియర్ సంతకాలతో కూడిన ఫామ్-20తో పాటు ఇతర అవసరమైన డాక్యుమెంట్లను కూడా డీలర్లు ఆన్‌లైన్ ద్వారా సమర్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. డీలర్లు సమర్పించిన పత్రాలను సంబంధిత రవాణాశాఖ అధికారులు రెండు పని దినాల్లో పరిశీలించి ఆమోదించాలని లేదా అవసరమైతే తిరస్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ విధానం అమలులోకి రావడంతో కార్యాలయాల వద్ద ఉండే రద్దీ కూడా తగ్గుతుందని భావిస్తున్నారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నకిలీ పత్రాలు సమర్పించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణాశాఖ హెచ్చరించింది. అటువంటి సందర్భాల్లో సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. డిజిటల్ విధానాన్ని ప్రోత్సహించడం, సేవలను వేగవంతం చేయడం మరియు అవినీతికి అవకాశాలు తగ్గించడం లక్ష్యంగా ఈ కొత్త విధానాన్ని అమలులోకి తీసుకొచ్చినట్లు రవాణాశాఖ అధికారులు తెలిపారు. ఈ మార్పుతో వాహన యజమానులు మరియు డీలర్లకు కూడా రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని వారు అభిప్రాయపడ్డారు.




# సైబర్ కేటుగాళ్లను హడలెత్తిస్తున్న తెలంగాణ పోలీసులు.. 117 మంది అరెస్ట్!

**మన దునియా,హైదరాబాద్: మార్చి13**

హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు కేటుగాళ్లపై ఉక్కుపాదం మోపుతున్నారు. విదేశాల్లో ఉంటూ మోసాలకు పాల్పడుతున్న క్రిమినల్స్ కు మ్యూల్ అకౌంట్లు సమకూరుస్తున్న వారిని వరుసగా అరెస్టులు చేస్తున్నారు. ఫిబ్రవరిలో ఆపరేషన్ ఆక్టోపస్ పేర వేర్వేరు రాష్ట్రాల్లో దాడులు జరిపిన ప్రత్యేక బృందాలు 117 మంది నిందితులను అరెస్ట్ చేశారు. వీటిలో అత్యధికంగా ఇన్వెస్ట్ మెంట్ ఫ్రాడ్ నేరాలు 63 ఉన్నాయి. ఆ తరువాత 6 డిజిటల్ అరెస్టులు, 4ఓటీపీ ఫ్రాడ్, ఒక సోషల్ మీడియా మోసం కేసులు ఉన్నాయి. ఇక, గత నెలలో 34.76లక్షల రూపాయలను బాధితులకు రీఫండ్ చేశారు.




**1081కేసుల్లో..**

ఆపరేషన్ ఆక్టోపస్ లో భాగంగా 16 రాష్ట్రాల్లో అరెస్ట్ చేసిన 117మంది నిందితులకు దేశవ్యాప్తంగా 1,081 కేసులతో సంబంధం ఉన్నట్టుగా వెల్లడైందని అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్) ఎం.శ్రీనివాస్ తెలిపారు. వీరి ఖాతాల్లో నుంచి 139 కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్టుగా నిర్ధారణ అయ్యిందన్నారు. ఇక, నిందితుల నుంచి 36లక్షల రూపాయల నగదు, 221 మొబైల్ ఫోన్లు, 26ల్యాప్ టాప్ లు, 115 చెక్ బుక్కులు, 141 సిమ్ కార్డులు, 54 డెబిట్ కార్డులు, 56 షెల్ కంపెనీల స్టాంపులు, ఒక క్యాష్ కౌంటింగ్ మిషన్, 152 పాస్ బుక్కులు, 5 ట్రేడ్ లైసెన్సులు, 6 ఆడిట్ నివేదికలు, 3 లెడ్జర్లను సీజ్ చేసినట్టు వివరించారు.

**జోనల్ సైబర్ సెల్స్..**

ఇక, జోనల్ సైబర్ సెల్స్ కు గత నెలలో 2,963 పిటిషన్లు వచ్చాయి. వీటిలో 461 పిటిషన్లపై అధికారులు ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారు. ఈ కేసుల్లో దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి 11మందిని అరెస్ట్ చేశారు. బాధితులకు 24.10 లక్షల రూపాయలను రీఫండ్ చేశారు.

**సైబర్ పెట్రోలింగ్..**

సైబర్ పెట్రోలింగ్ ను నిరంతరం జరుపుతూ ఇంటెలిజెన్స్ ట్రాకింగ్ ద్వారా ఆన్ లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్ లను సోషల్ మీడియాలో ప్రోత్సహిస్తున్న124 ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రాం ప్రొఫైళ్లను సైబర్ పోలీసులు గుర్తించారు. 539 పెయిడ్ అడ్వర్టయిజ్ మెంట్లను నడుపుతూ యువతను బెట్టింగ్, గేమింగ్ వైపు ఆకర్షితులను చేస్తున్నారు. ఈ క్రమంలో 124 ప్రొఫైళ్లను సోషల్ మీడియా ప్లాట్ ఫాంల నుంచి తొలగించారు.

**సీ మిత్ర..**

సీ మిత్ర ద్వారా గత నెలలో సైబర్ మోసాలకు గురైన 2,396మంది బాధితులకు ఫిర్యాదులు నమోదు చేయటంలో మార్గదర్శకత్వం అందించారు. ఈ క్రమంలో వచ్చిన కంప్లయింట్ల ఆధారంగా 257 జీరో ఎఫ్ఐఆర్ లను జారీ చేశారు. సైబర్ మోసానికి గురైతే బాధితులు వెంటనే 1930 నెంబర్ కు ఫోన్ చేయాలని అదనపు కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. దాంతోపాటు www.cybercrime.gov.in లో కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు....

## పోలీస్ శాఖలో కొలువుల జాతర!, ఏ క్షణమైనా మెగా నోటిఫికేషన్

**మన దునియా,హైదరాబాద్: మార్చి13**

తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీస్ పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. యూనిఫామ్ వేసుకోవాలనే లక్ష్యంతో ఉన్న వేలాది మంది యువతీ యువకులకు ఈ ఏడాది 'మెగా నోటిఫికేషన్' లభించే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్ర పోలీస్ విభాగంలో ఏటా పెరుగుతున్న ఖాళీలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి భారీ ఎత్తున నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2026 ఫిబ్రవరి చివరి నాటికి అందుబాటులో ఉన్న ఖాళీలపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందింది. పోలీసు శాఖ అందించిన గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో మొత్తం 95,361 పోలీసు పోస్టులు మంజూరవ్వగా, ప్రస్తుతం కేవలం 77,369 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. అంటే దాదాపు 17,992 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శాంతి భద్రతల పరిరక్షణలో ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే ఈ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పోలీస్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ప్రభుత్వ ఆమోదం లభించిన వెంటనే నియామక ప్రక్రియ ప్రారంభం కానుంది. పోలీస్ ఎంపిక ప్రక్రియ సుదీర్ఘంగా సాగుతుంది కాబట్టి, ముందస్తుగానే అనుమతులు కోరుతూ ప్రతిపాదనలు పంపారు.

**ఎస్సై పోస్టు ఇక 'రాష్ట్ర స్థాయి'!**

పోలీసు పదోన్నతులకు సంబంధించి దశాబ్దాలుగా నెలకొన్న వివాదాలకు చెక్ పెట్టేందుకు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు జోన్ల వారీగా ఉన్న ఎస్సై పోస్టులను ఇకపై 'రాష్ట్ర స్థాయి' పోస్టులుగా మార్చబోతున్నారు. ఈ మేరకు సర్వీస్ రూల్స్‌లో మార్పులు చేస్తూ పంపిన ప్రతిపాదనలపై ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. అక్కడ ఆమోదం పొందితే, ఎస్సైల ట్రాన్స్ ఫర్, ప్రమోషన్స్ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా జరిగే అవకాశం ఉంటుంది. దీనివల్ల పదోన్నతుల ప్రక్రియ మరింత వేగవంతం కానుంది.

**ఖాతా తెరవనున్న నోటిఫికేషన్లు!**

కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత భారీ ఎత్తున నియామకాలు జరగనున్న నేపథ్యంలో, అభ్యర్థులు ఇప్పటి నుంచే తమ ప్రిపరేషన్‌ను వేగవంతం




చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సివిల్, ఏఆర్ విభాగాలతో పాటు ఇతర స్పెషల్ బెటాలియన్లలో కూడా పోస్టులు ఉండటంతో.. యూనిఫామ్ వేసుకోవాలనే కల కంటున్న వేలాది మంది యువతకు ఇది ఒక సువర్ణావకాశం అని చెప్పవచ్చు

**సుదీర్ఘ ప్రక్రియ.. ముందే సన్నద్ధం కావాలి!**

పోలీసు ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ సాధారణ ఉద్యోగాల కంటే భిన్నంగా, క్లిష్టంగా ఉంటుంది. దేహదారుఢ్య పరీక్షలు మరియు రాత పరీక్షల నిర్వహణకు ఎక్కువ సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో, నోటిఫికేషన్ వచ్చిన వెంటనే అభ్యర్థులు సిద్ధంగా ఉండేలా పోలీస్ శాఖ ముందస్తు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపింది. ఒకసారి అనుమతి లభిస్తే, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు షెడ్యూల్‌ను విడుదల చేయనుంది.

**ప్రభుత్వ ఆమోదం కోరుతూ ప్రతిపాదనలు!**

శాఖలో పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించడానికి, శాంతిభద్రతల పరిరక్షణను మరింత పటిష్టం చేయడానికి ఈ ఖాళీల భర్తీ అత్యవసరమని అధికారులు భావిస్తున్నారు. ఖాళీగా ఉన్న ఈ 18 వేల ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రభుత్వం నుంచి తుది నిర్ణయం వెలువడితే, నిరుద్యోగులకు ఇది అతిపెద్ద శుభవార్త కానుంది.

## మాజీ డీజీపీ హెచ్.జె. దొర కన్నుమూత... పోలీస్ వ్యవస్థకు విశిష్ట సేవలందించిన అధికారి ఇక లేరు

**మన దునియా,హైదరాబాద్: మార్చి13**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హెచ్.జె. దొర కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, పోలీస్ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మావోయిస్టు ఉద్యమం తీవ్రంగా కొనసాగుతున్న సమయంలో హెచ్.జె. దొర డీజీపీగా కీలక బాధ్యతలు నిర్వహించారు. గ్రేహౌండ్స్ దళాన్ని బలోపేతం చేయడంలో, నక్సలిజంపై వ్యూహాత్మకంగా పోరాడటంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో సాంకేతికతను ప్రవేశపెట్టడం, కమ్యూనికేషన్ వ్యవస్థను ఆధునికీకరించడం వంటి పలు సంస్కరణలకు ఆయన నాంది పలికారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు ఐదున్నర సంవత్సరాలకు పైగా డీజీపీగా సేవలందించిన అరుదైన రికార్డు ఆయన సొంతం. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో ఆయన విశ్వసనీయ అధికారిగా గుర్తింపు పొందారు. డీజీపీ పదవీ విరమణ అనంతరం కేంద్ర నిఘా విభాగంలో విజిలెన్స్ కమిషనర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించి ప్రజాసేవలో తన ప్రత్యేక ముద్ర వేశారు.



# మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెలపై చలవ పందిర్లు ఏర్పాటు చేయాలి.

**ఆలయ అభివృద్ధి పనులలో వేగం పెంచాలి.**

**ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశానికి సిద్ధం చేయాలి.**

**అంగన్వాడి విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలి.**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

**మన దునియా,ఎస్.ఎస్.తాడ్వాయి,**

**ములుగు జిల్లా:మార్చి 13**




మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెలపై చలవ పందిర్లు ఏర్పాటు చేయాలని, ఆలయ అభివృద్ధి పనులలో వేగం పెంచాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అంగన్వాడి విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్.ఎస్ తాడ్వాయి మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులను, 99 రోజుల ప్రజా ప్రణాళిక ప్రగతి పాలన లో భాగంగా ఊరట్టం గ్రామపంచాయతీ కొత్తూరు హ్యాబిటేషన్ లో జరుగుతున్న పారిశుధ్య పనులను, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతల గద్దెలపై చలువ పందిర్లు ఏర్పాటు చేయాలని, ఆలయ ప్రాంగణంలోని డ్రైనేజీ సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని, ఆలయ రిలేయింగ్ ఫ్లోరింగ్ పనులలో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ 99 రోజుల ప్రజా ప్రణాళిక ప్రగతి పాలన లో భాగంగా ఊరట్టం గ్రామపంచాయతీ కొత్తూరు హ్యాబిటేషన్ లో జరుగుతున్న పరిశుభ్రత కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లడుతూ గ్రామం లో మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంలో స్వయంగా భాగస్వామ్యం కావాలని గ్రామపంచాయతీ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చూసుకోవాలని అన్నారు. పరిశుభ్రత, పారిశుధ్యం వంటి కార్యక్రమాలు చేపట్టిన అందరూ గ్రామాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి విజయవంతం చేయాలన్నారు.అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించారు. వివిధ దశలలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసుకొని ఉగాది పండగ వరకు గృహ ప్రవేశాలు చేయాలని లబ్ధిదారులకు సూచనలు చేశారు.అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్వాడి కేంద్రంలోని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని పిల్లలకు బాలింతలకు గర్భిణీ స్త్రీలకు పంపిణీ చేసే పాల ప్యాకెట్ పై ఉండే ముద్రణ తేదీలను గమనిస్తూ గడువు దాటిన వాటిని గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు.పిల్లల ఎత్తు, బరువులను తరచు పరిశీలిస్తూ రక్తహీనతతో ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రం పరిసరాలు శుభ్రంగా ఉండాలని, పిల్లలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రీ-స్కూల్ బోధన లో భాగంగా చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయాలని, పిల్లలు ఉత్సాహంగా ఉండేలా వాతావరణాన్ని కల్పించాలని, టీచర్లకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వీరస్వామి, డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీధర్, ఆర్ అండ్ బి డి ఈ, అంగన్వాడి ఉపాధ్యాయురాలు రోహిణి, ఊరట్టం గ్రామపంచాయతీ సర్పంచ్ కోరం శైలజ, వెంకటేష్ నాగమణి ప్రజాప్రతినిధులు, మేడారం ఆలయ గుత్తేదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం -- ఇసుక లారీల వేగంతో పెరుగుతున్న ప్రమాదాలు







**మన దునియా,ములుగు జిల్లా: మల్లంపల్లి:మార్చి13**

ములుగు జిల్లా ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మరియు అధిక వేగంతో తిరుగుతున్న ఇసుక లారీలేనని బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్ ఆరోపించారు.రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో సరైన డైవర్షన్ బోర్డులు, రోడ్డు మార్కింగ్‌లు, హెచ్చరిక సూచనలు మరియు సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అవి లేకపోవడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేదా లైట్లు లేకపోవడం వల్ల ప్రమాదాల అవకాశాలు మరింత పెరుగుతున్నాయి.అదే సమయంలో ఈ మార్గంలో అధిక వేగంతో సంచరిస్తున్న ఇసుక లారీలు ప్రజల ప్రాణాలకు పెద్ద ముప్పుగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలను పట్టించుకోకుండా వేగంగా లారీలు నడపడం వల్ల ప్రమాదాలు మరింత పెరుగుతున్నాయని తెలిపారు.వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై విచారణ జరిపి, సరైన డైవర్షన్లు, రోడ్డు మార్కింగ్‌లు, హెచ్చరిక సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని, అలాగే అధిక వేగంతో తిరుగుతున్న ఇసుక లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజల ప్రాణాలతో ఆటలాడే ఈ నిర్లక్ష్యాన్ని వెంటనే ఆపాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి పెద్ద స్థాయిలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షులు గోల్కొండ రాజు, మెరుగు రాజు, బిఆర్ఎస్ మండలం పార్టీ యూత్ అధ్యక్షులు మొర్రి రాజు యాదవ్, బిజెపి జిల్లా నాయకులు కత్తి హరీష్ గౌడ్, మొహమ్మద్ పాషా, కుక్కల సంపత్, పోతరాజు రమేష్, గొట్టేముక్కుల నరేష్, నవీన్, మహేష్, కార్తీక్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## గద్వాల్: పంచాయతీ కార్యదర్శికి ఏసీబీ షాక్

**మన దునియా,జోగులాంబ గద్వాల జిల్లా అయిజ,ఎక్లాస్పురం: మార్చి 13**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం ఎక్లాస్పురం పంచాయతీ కార్యదర్శి రంగన్న, పేద లబ్ధిదారుడికి మంజూరైన ఇందిరమ్మ ఇంటికి క్లియరెన్స్ ఇవ్వడానికి రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో, ఏసీబీ అధికారులు రంగన్నను ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో రూ.15 వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. పేదలకు అందాల్సిన పథకాల విషయంలో లంచం అడిగితే సహించేది లేదని ఏసీబీ అధికారులు తెలిపారు.



## మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్ లెవల్ ఆఫీసర్‌ను నియమించాలి**

**రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**మన దునియా,ములుగు జిల్లా: మార్చి13**




ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, ప్రతి పోలింగ్ స్టేషన్ కు బూత్ లెవెల్ ఆఫీసర్ ను నియమించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాదు నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ములుగు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకు గాను గ్రామ పాలన అధికారులు, ఇతర అధికారులను బూత్ స్థాయి అధికారులకు మ్యాపింగ్ లో సహాయకులుగా నియమించి ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, ఏ ఈ ఆర్ ఓ లు వారికి మ్యాపింగ్ చేయడంలో సహాయ సహకారాలు అందించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జరిగేలా పకడ్బందీగా ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి బూతు స్థాయి ఏజెంట్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఆర్డీవో ను ఆదేశించారు. తహసిల్దార్లు మ్యాపింగ్ లో ఎలాంటి పొరపాటులకు తావునీయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ వెంకటేష్, ఎలక్షన్ సెల్ సూపరిండెంట్ సలీం పాషా, ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, ఎలక్షన్ డ్యూటీ నితీష్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ మందుల నాణ్యత, సరఫరాపై లోక్‌సభలో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**మన దునియా,న్యూఢిల్లీ:మార్చి 13**

వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ఆయుష్ వైద్య సంస్థల్లో మందుల నాణ్యత, నిరంతర సరఫరాపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో ప్రశ్నించారు. గత మూడు సంవత్సరాల్లో వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుష్ కేంద్రాల్లో మందుల నాణ్యతపై ఎలాంటి తనిఖీలు నిర్వహించారో వివరాలు ఇవ్వాలని కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖను ఎంపీ కోరారు.అలాగే ఆయుష్ వైద్య కేంద్రాల్లో సరఫరా అయ్యే మందులపై సంవత్సరం వారీగా చేసిన తనిఖీలు, సేకరించిన నమూనాలు, పరీక్షల ఫలితాలు, నాసిరకం లేదా నకిలీగా తేలిన మందుల వివరాలు తెలియజేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించని తయారీదారులు లేదా సరఫరాదారులపై తీసుకున్న చర్యలు --- లైసెన్స్ సస్పెన్షన్, రద్దు, బ్లాక్‌లిస్టింగ్, బకాయిల వసూళ్లు, కేసులు నమోదు వంటి చర్యలపై వివరాలు కోరారు.అదేవిధంగా, ఆయుష్ మందుల కొరత లేకుండా ఉండేందుకు నేషనల్ ఆయుష్ మిషన్ లేదా ఇతర కేంద్ర పథకాల కింద డిజిటల్ స్టాక్ మానిటరింగ్ వ్యవస్థ అమలు చేస్తున్నారా అనే అంశంపై కూడా ఎంపీ ప్రశ్నించారు.దీనికి సమాధానంగా కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాధవ్ మాట్లాడుతూ ప్రజారోగ్యం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండే అంశమని తెలిపారు. తెలంగాణలోని వరంగల్ సహా అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ ఆయుష్ ఆసుపత్రులకు నాణ్యమైన మందుల సరఫరా బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన వివరాల ప్రకారం ఆయుష్ విభాగం ద్వారా మందుల నమూనాలను యాదృచ్ఛికంగా, బ్యాచ్ వారీగా సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నాణ్యత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మందులనే ఆసుపత్రులకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. నాణ్యతలో లోపాలు తేలితే సరఫరాదారులు తమ ఖర్చుతోనే మందులను వెనక్కి తీసుకుని కొత్తవి అందజేయాల్సి ఉంటుందని తెలిపారు.అలాగే తెలంగాణలో ఈ-ఔషధి డిజిటల్ వ్యవస్థను అమలు చేసి ఆయుష్ మందుల నిల్వలు, సరఫరాను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఆయుష్ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు లేదా వైద్యాధికారులు ఈ వ్యవస్థ ద్వారా మందుల కోసం ఇండెంట్ పెట్టే అవకాశం ఉందని, స్టాక్ వివరాలు ఆన్లైన్లో అందుబాటులో ఉండటంతో అక్రమాలు, కొరతలను నివారించవచ్చని పేర్కొన్నారు. వరంగల్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆయుష్ వైద్య వ్యవస్థ బలోపేతంపై ఎంపీ డా. కడియం కావ్య నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# భద్రకాళి ఆలయంలో ధర్మకర్తల పెత్తనం -- భక్తుల్లో ఆగ్రహం

**గుడిలో సేవలకా..? పెత్తనానికా..?**

**మన దునియా,వరంగల్ జిల్లా: మార్చి13**

భక్తుల సేవ కోసం నియమించిన ధర్మకర్తలు, గుడి యజమానుల్లా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




గంటల క్యూలో భక్తులు -- నిమిషాల్లో దర్శనం పరిచయస్తులకు..!

సామాన్య భక్తులు గంటల తరబడి క్యూలో నిలబడుతుంటే, పరిచయాల ఆధారంగా కొందరికి వెంటనే ప్రత్యేక దర్శనాలు కల్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దేవాదాయ శాఖ మంత్రి ఇలాకాలో ధర్మం తప్పుతోందా..?

ప్రముఖ పుణ్యక్షేత్రంలో జరుగుతున్న ఈ పరిణామాలు దేవాదాయ శాఖ వ్యవస్థపైనే ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని భక్తులు అంటున్నారు.

ధర్మకర్తలా..? లేక గుడి యజమానులా..?

ఆలయ పరిపాలనను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉన్న ధర్మకర్తలు, అధికార ప్రదర్శనకు దిగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అమ్మవారి సాక్షిగా ముష్టి యుద్ధాలా..?

ఆలయ ప్రాంగణంలోనే వాగ్వాదాలు, గొడవలు చోటుచేసుకోవడం భక్తుల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తిస్తోంది.

అధికారులకే ఇబ్బందులు పెడుతున్న ధర్మకర్తలు..?

ఆలయ నిర్వహణలో అనవసర జోక్యం చేస్తూ అధికారులను కూడా ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రత్యేక దర్శనాల రాజకీయాలు..?

గుడి దేవుడిది అయినా, దర్శనం మాత్రం పరిచయాలదేనా అని సామాన్య భక్తులు ప్రశ్నిస్తున్నారు.

మహిళలు, చిన్న పిల్లలకూ ఇబ్బందులే..!

పసిపిల్లలతో వచ్చిన మహిళలకు కూడా సౌకర్యం కల్పించకపోవడం పట్ల మహిళా భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భక్తుల విశ్వాసానికి మచ్చ పడుతోందా..?

ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఆలయంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం పట్ల భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ధర్మకర్తల వ్యవస్థ రద్దు చేయాలనే డిమాండ్..!

సామాన్య భక్తులకు ఇబ్బందులు కొనసాగితే ధర్మకర్తల వ్యవస్థను పునఃపరిశీలించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

మొత్తంగా:

ధర్మకర్తలు అధికారం చూపేందుకు కాదు, భక్తులకు సేవ చేయడానికి ఉన్నారని గుర్తుంచుకోవాలని భక్తులు స్పష్టం చేస్తున్నారు.

# యశోదలో రోబోటిక్ ఎండోస్కోపిక్ సర్జరీలు

**డాక్టర్ కె. ఎస్. కిరణ్**

**మన దునియా,సికింద్రాబాద్: మార్చి13**

అధునాతన సర్జికల్ పద్ధతులు రోబోటిక్ ఎండోస్కోపిక్ సర్జరీలు యశోద హాస్పిటల్ లో అందుబాటులో ఉన్నాయని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ డాక్టర్ కె. ఎస్. కిరణ్ తెలిపారు.శుక్రవారం హనంకొండ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతు ఎండోస్కోప్ వాడటం వల్ల పెద్ద గాట్లు అవసరం లేకుండా, చిన్న రంధ్రం ద్వారా చేసే 'కీ-హోల్' సర్జరీలు నిర్వహించవచ్చు. దీనివల్ల పేషెంట్ త్వరగా కోలుకుంటారు. ఇది ఒక రకమైన 'గూగుల్ మ్యాప్స్' లాంటిది. సర్జరీ సమయంలో మెదడులో ఏ భాగానికి వెళు తున్నాం, ఎక్కడ ట్యూమర్ ఉంది అనేది నావిగేషన్ మెషిన్ ద్వారా ఖచ్చితంగా తెలుస్తుంది. వరంగల్ వైద్యులు అందరూ కూడా సరైన నిర్ణయమే తీసుకున్నారు. ఒక నెల రోజులుగా టిబి గడ్డ పెరుగుతుండటం, అది ఒక క్రిటికల్ ఏరియాలో ఉండటం వల్ల బయాప్సీ కోసం మన దగ్గరికి పంపించారు.మేము ఈ బయాప్సీ కోసం రోబోటిక్ నావిగేషన్ అసిస్టెడ్ సర్జరీ ని ఉపయోగించి ఆ గడ్డను పూర్తిగా తొలగించాము.రోబోటిక్ న్యూరో సర్జరీ వల్ల ప్రయోజనాలుతక్కువ ఖర్చు చికిత్స ఖర్చు చాలా వరకు తగ్గుతుంది.వేగంగా కోలుకోవడం పేషెంట్ త్వరగా డిశ్చార్జ్ అయ్యి తన పనులు తాను చేసుకోగలుగుతారు.తక్కువ ఇన్ఫెక్షన్ ఈ పద్ధతిలో ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలు చాలా తక్కువ.న్యూరో మానిటరింగ్ సిస్టమ్ పేషెంట్ మత్తులో ఉన్నప్పుడు కూడా, సర్జరీ సమయంలో చేతులు లేదా కాళ్లు పడిపోయే ప్రమాదం ఉంటే మాకు వెంటనే తెలిసిపోతుంది. న్యూరో అనస్థీషియా ద్వారా గమనిస్తూ అత్యంత సురక్షితంగా సర్జరీ పూర్తి చేయవచ్చు తెలిపారు.ఈ కార్యక్రమం లో మేనేజర్ కాల్వ శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్లు రాజుకుమార్, స్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.




# గ్యాస్ సరఫరాపై అపోహలు వద్దు.





**ఎలాంటి భయాందోళనకు గురి కావొద్దు.**
**బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత లేదు.**
**అపోహలను అడ్డు పెట్టుకుని బ్లాక్ చేస్తే ఉపేక్షించేది లేదు.**
**చర్యలు కఠినంగా ఉంటాయి.**
**జిల్లాలో సమన్వయ కమిటీలతో తక్షణం సమావేశం ఏర్పాటు చెయండి.**
**రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.**

**మన దునియా,ములుగు జిల్లా: మార్చి13**

గ్యాస్ కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని, గ్యాస్ సరఫరా పై అపోహలు నమ్మవద్దని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గ్యాస్ సిలిండర్ల పై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతోటే ఈ దుస్థితి ఏర్పడిందని,గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులకు, విద్యా సంస్థలతో పాటు ప్రభుత్వ సంస్థలకు,ఆశ్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ పర్యవేక్షణ జరుగుతుందని మంత్రి తెలిపారు. అమెరికా-ఇరాన్ కు మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో ఎల్.పి.జి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్ట్యా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబెద్కర్ సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ములుగు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్.పి.జి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని,గృహ వినియోగదారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు.సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు.ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72% బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రిలకు,విద్యాసంస్థలకు,వృద్ధాశ్రమలకు,ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు.రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్.పి.జి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు.ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు.అపోహలను అడ్డపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు.తాజగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం,అక్రమంగా మళ్లించడం ,బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడనందుకు గాను ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు.ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విదంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు,ఎస్.పి లు,పోలీస్ కమీషనర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.ఆయా జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు, సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆయన సూచించారు.పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి , గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు.అదే సమయంలో అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని, గృహా వినియోగ దారులకు సరిపడా గ్యాస్ సరఫరా చేస్తామని,ప్రభుత్వం దగ్గర ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ యాసంగి ధాన్యం సేకరణ కు గన్నీలు,ధాన్యం నిల్వ కు స్పేస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.జిల్లాలలో వరి సాగు పెరిగిందని,పంటల స్థితి గతులు ననుసరించి సాగు నీరు అందిస్తూ వైవిధ్యత పంటలను ప్రోత్సహించాలని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలకు అవసరమైన మేరకు స్టాక్ అందుబాటులో ఉందని తెలిపారు. అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను కోరారు. అలాగే జిల్లాలో రైతులకు సరిపడిన సాగునీరు అందుబాటులో ఉందని చెప్పారు.అసత్య ప్రచారాలను ఆసరాగా చేసుకుని బ్లాక్ మార్కెటింగ్ చేసిన సిలిండర్లను ఉద్దేశపూర్వకంగా బ్లాక్ చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, డి సి ఎస్ ఓ ఫైజల్ హుస్సేన్, ఇరిగేషన్ ఈ ఈ అప్పలనాయుడు, హార్టికల్చర్ అధికారి సంజీవరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భార్య ఆత్మహత్యను అడ్డుకోకుండా వీడియో తీసిన లోకో పైలట్

కడప జిల్లా రాజంపేటలో చోటుచేసుకున్న వివాహిత ఆత్మహత్య కేసులో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనకు సంబంధించిన కథనం రూపంలో...

రాజంపేట : భార్య ఆత్మహత్య చేసుకుంటుంటే వీడియో తీసిన భర్త.. కిరాతక చర్యకు లోకో పైలట్ పాల్పడటంపై కలకలం

రాజంపేట : వైఎస్సార్ కడప జిల్లా రాజంపేటలో మానవత్వం మంటగలిసే ఘటన వెలుగుచూసింది. భార్య ఆత్మహత్యకు పాల్పడుతుంటే అడ్డుకోవాల్సిన భర్త, ఆమెను రక్షించాల్సింది పోయి ఉరి వేసుకునే దృశ్యాలను సెల్ ఫోన్‌లో వీడియో తీస్తూ పైశాచిక ఆనందం పొందాడు.

అసలేం జరిగిందంటే?

ఒంగోలుకు చెందిన శ్రీరామ్ శ్రీనివాస్ రైల్వే శాఖలో లోకో పైలట్‌గా పనిచేస్తూ, రాజంపేట బోయినపల్లిలో రైల్వే కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. 2016లో మొదటి భార్య చనిపోయిన విషయాన్ని దాచిపెట్టి, నందలూరుకు చెందిన కృష్ణవేణిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వేధింపులే కారణం:

కొంతకాలంగా శ్రీనివాస్ మద్యం తాగి వచ్చి కృష్ణవేణిని తీవ్రంగా వేధిస్తున్నట్లు సమాచారం. బెల్టుతో కొట్టడం, ఆమెను బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా ఫోన్ లాక్కుని బంధించడం వంటివి చేసేవాడని బాధితురాలి తరపు వారు ఆరోపిస్తున్నారు. ఈ వేధింపులు భరించలేక కృష్ణవేణి బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించింది.

పైశాచికత్వం :

కృష్ణవేణి ఉరి వేసుకుంటున్న సమయంలో శ్రీనివాస్ ఆమెను కాపాడకుండా, పక్కనే కూర్చుని ఎలా ఉరి వేసుకోవాలో సూచనలు ఇస్తూ, నవ్వుతూ వీడియో తీయడం కలకలం రేపుతోంది. ఆమె ప్రాణాలు విడుస్తున్నా ఏమాత్రం చలించకుండా ఆ దృశ్యాలను చిత్రీకరించాడు.

పోలీసులకు లొంగుబాటు:


భార్య చనిపోయిన తర్వాత మద్యం సేవించి తన కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన శ్రీనివాస్, అనంతరం రాజంపేట పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి: లింగాల కమలరాజు





**హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం**

**కొనుగోలు కేంద్రాలు లేక దళారీల పాలవుతున్న మొక్కజొన్న రైతులు**

**కేసీఆర్ పాలనలో కరోనా సమయంలోనూ రైతులకు అండగా నిలిచాం**

**మన దునియా,చింతకాని:మార్చి 13**

చింతకాని:తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించడంలోనూ, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలోనూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఖమ్మం మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజు విమర్శించారు.శుక్రవారం చింతకాని మండలంలోని నాగులవంచ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు వంకాయలపాటి సత్యనారాయణ నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చింతకాని మరియు బోనకల్లు మండలాలు రాష్ట్రంలోనే అత్యధికంగా మొక్కజొన్న పండించే ప్రాంతాలని తెలిపారు. అయితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొక్కజొన్నకు రూ. 2,400 మద్దతు ధర ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు రూ. 1,600కే కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలంటే వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎలాంటి ఆపదలేని పరిస్థితుల్లో కూడా ప్రభుత్వానికి 'రాజకీయ కరోనా' సోకినట్లుగా రైతులను గాలికొదిలేశారని ఎద్దేవా చేశారు.ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో జిల్లా మంత్రులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో పంట నష్టం జరిగితే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా పొలాల్లోకి వెళ్లి రైతులకు భరోసా ఇచ్చి, నిబంధనలకు అతీతంగా పరిహారం అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఊరూరా తిరిగి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతు భరోసా కింద రూ. 15 వేల సహాయం ఇస్తామని చెప్పి నేడు మాట తప్పుతున్నారని విమర్శించారు. అలాగే వృద్ధులకు రూ. 4 వేల పెన్షన్, వికలాంగులకు రూ. 6 వేల పెన్షన్ ఇస్తామని ప్రకటించిన హామీలు కూడా అమలు కావడం లేదని అన్నారు.రైతు బీమా అందక రైతుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మేము కొత్తగా ఏమీ అడగడం లేదని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నామని తెలిపారు. యూరియా కోసం లైన్లలో నిలబడి, కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి రైతులకు రావడం దురదృష్టకరమని అన్నారు.ఈ సమావేశంలో మంకెన రమేష్, కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, మాజీ ఎంపీపీ పొనుగోటి రత్నాకర్, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, గడ్డం శ్రీనివాస్, వేముల నర్సయ్య, అప్పారావు, బండి రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్‌సి పరీక్షలకు పటిష్ట పోలీస్ బందోబస్తు

**పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు..ఎస్ఎస్‌సి పరీక్షలకు పోలీసుల ప్రత్యేక చర్యలు**

**విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి పోలీసుల ప్రత్యేక ఏర్పాట్లు**

**మన దునియా,ఫ్యూచర్ సిటీ: మార్చి13**



ఫ్యూచర్ సిటీ కమీషనరేట్ పరిధిలో మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల కోసం పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు ఐపీఎస్ తెలిపారు.ఈ ఏడాది ఫ్యూచర్ సిటీ పరిధిలో సుమారు 15,764 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు.పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.ప్రతి పరీక్షా కేంద్రం వద్ద శాంతిభద్రతల కోసం పోలీస్ సిబ్బందిని మోహరించనున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ల నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలను తరలించే సమయంలో, అలాగే జవాబు పత్రాలను తిరిగి పంపించే సమయంలో ప్రత్యేక ఎస్కార్ట్ బృందాలు భద్రత కల్పిస్తాయని వెల్లడించారు.పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, టాబ్లెట్లు, స్మార్ట్ వాచ్‌లు, పెన్ డ్రైవ్‌లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావడం పూర్తిగా నిషేధమని తెలిపారు.పరీక్షా కేంద్రాల పరిసరాల్లో గుంపులుగా చేరకుండా ఉండేందుకు బి.ఎన్.ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు చెప్పారు.అదేవిధంగా పరీక్షా కేంద్రాల సమీపంలోని జెరాక్స్ సెంటర్లను పరీక్షల సమయంలో మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పేపర్ లీకేజీ పుకార్లను అరికట్టేందుకు ప్రత్యేక స్క్వాడ్లు, ముఫ్తీ పోలీసులు నిఘా ఉంచుతారని వెల్లడించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ విభాగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల జోన్ల నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి ఎక్కడైనా అక్రమాలు లేదా మాల్ ప్రాక్టీస్ జరిగినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విద్యార్థులు, తల్లిదండ్రులు పోలీసులకు సహకరించి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

# 10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబికి చిక్కిన సీనియర్ అకౌంటెంట్ అరెస్ట్

**మన దునియా,యాదాద్రి భువనగిరి జిల్లా:మార్చి13**

యాదాద్రి భువనగిరి జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారులు లంచం తీసుకుంటూ పట్టుబడిన ప్రభుత్వ అధికారిని అరెస్ట్ చేశారు. మోత్కూర్‌లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అకౌంటెంట్ మొహమ్మద్ ఖదీర్‌ను రూ.10,000 లంచం తీసుకున్న కేసులో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం, ఒక ఉద్యోగి జీత బిల్లును ప్రాసెస్ చేయడానికి ఖదీర్ రూ.10,000 లంచం డిమాండ్ చేశాడు. డబ్బును ఫోన్‌పే ద్వారా పంపించాలని సూచిస్తూ, తన ఖాతాతో పాటు మరో సహోద్యోగి ఖాతాకు కూడా మొత్తాన్ని పంపించాలని కోరాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు ఉచ్చుపన్ని నిందితుడిని పట్టుకున్నారు.లంచం స్వీకరించిన సీనియర్ అకౌంటెంట్ మొహమ్మద్ ఖదీర్‌ను అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు, అతడిని హైదరాబాద్‌లోని కేసుల విచారణకు సంబంధించిన మొదటి అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరచనున్నట్లు తెలిపారు.




## మిత్రమా... కాస్త సమయం వెచ్చించి పూర్తిగా చదువు...




ప్రతి మనిషికి తనకు నచ్చినట్టుగా జీవించే హక్కు ఉంది.కానీ ఆ జీవితం మంచిగా, సంస్కారవంతంగా ఉండాలా...లేక చెడ్డవారి సాంగత్యంలో పడిపోయి చెడు పనులు చేస్తూ తన కర్మను భారంగా మోసుకుంటూ ఉండాలా... అనేది మనమే నిర్ణయించుకోవాలి. ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోండి...చావడం కానీ...చంపడం కానీ... నీకు ఎలాంటి అధికారం లేదు. ఎందుకంటే ఈ దేహం నీది కాదు. ఈ దేహాన్ని నీవు సృష్టించలేదు.చావడం... చంపడం...ఇవి జ్ఞానులు చేసే పనులు కావు.అవి కేవలం అజ్ఞానులు మూర్ఖులు చేసే పనులు.ఎందుకంటే ఈ రెండు కూడా ఏ సమస్యకు పరిష్కారం కావు.ఆ సమయంలో క్షణిక ఆవేశంలో తీసుకున్న ఒక తప్పుడు తప్పు నిర్ణయం...నీ జీవితాన్ని మాత్రమే కాదు..నీ కుటుంబాన్ని కూడా అంధకారం వైపు నెడుతుంది.

తుదకు ఏమవుతుందో తెలుసా...?

నీ పిల్లలు అనాధలవుతారు.నీ కుటుంబం కన్నీటి సముద్రంలో మునిగిపోతుంది.అందుకే రివెంజ్ అనేది జీవితంలో తీసుకునే అత్యంత చెడ్డ నిర్ణయం.

ఎందుకంటే...

ఈ రోజు నువ్వు ఎవ్వరినైనా చంపితే...మరో రోజు కావొచ్చు.. లేదా ఏదో ఒక రోజు...నువ్వు కూడా చావడమే కదా!దాని కోసం... చంపడం.. లేదా చావడం సరైన నిర్ణయం అంటారా...? మీరే ఆలోచించండి.భగవంతుడు ఇచ్చిన ఈఅమూల్యమైన దేహాన్ని చెడుకి కాదు...మంచికే ఉపయోగించాలి.సహజ సిద్ధంగా...యాదృచ్ఛికంగా...

సమయం వచ్చినప్పుడు ఈ దేహాన్ని విడిచిపెట్టడం అదే సృష్టి యొక్క ధర్మం..అదే భగవంతుని నిర్ణయం.మిత్రమా..నీ జీవితంలో జరుగుతున్న ప్రతి సంఘటన...జరగబోయే ప్రతి పరిణామం...అన్నీ కూడా నీ పూర్వజన్మ కర్మ ఫలితాలే.

అందుకే నీ జీవితంలో జరుగుతున్నదాన్ని...

జరగబోయేదాన్ని...

ఒక సాక్షి భావంతో చూడడం నేర్చుకో... అంటే...

నీ జీవితాన్ని ఒక ప్రేక్షకుడిలా...నీ జీవితాన్ని ఒక సినిమాలా...చూసే ప్రయత్నం చేయి.

ఆవేశం వద్దు...

కోపం వద్దు...

అక్రోశం వద్దు...

కక్ష సాధింపు చర్య వద్దు.

స్థితప్రజ్ఞత అనే గొప్ప గుణాన్ని అలవాటు చేసుకో. ఎందుకంటే ఈ జీవితమనే ప్రొజెక్టర్‌లో సృష్టికర్తే నీ జీవిత కథకు దర్శకుడు.

నీకు ఈ దేహమనే పాత్రను ఇచ్చాడు...అదే సమయంలో నీ కర్మ అనే స్క్రిప్ట్‌ను కూడా నీతో పాటు పంపించాడు.నీవు కేవలం నీ పాత్రను అద్భుతంగా పోసించు.

అందుకే మిత్రమా..గుర్తుంచుకో...

జరిగేది జరగక మానదు. జరుగుతున్నది నీ మంచికే. జరగబోయేది కూడా నీ మంచికే.ఏది జరిగినా...దాన్ని దైవానుగ్రహంగా స్వీకరించు.పరమాత్మ ఇచ్చిన ఈ జీవితాన్ని ఆనందంగా గడపడానికి ప్రయత్నించు.రేపు అనే దానికి రూపం లేని ఈ శరీరం కోసం..

ఎందుకింత ఆరాటం...?

ఎందుకంత పోరాటం...?

ఈ సృష్టిలో మనమంతా కూడా వచ్చి పోయే ప్రయాణికులమే.

ఎవ్వరూ ఇక్కడ శాశ్వతంగా ఉండరు.

అందుకే ప్రేమతో జీవించండి...మంచి పనులు చేయండి...మానవత్వాన్ని నిలబెట్టండి.నీ తోటివారికి సహాయం చేయండి. సర్వజీవులపై ప్రేమ, దయను కలిగి ఉండండి.

శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో ఇలా బోధించారు...

"కర్మనుబంధేనా మనుష్యలోకే..."

ఈ లోకంలో ఎంతటి వాడికైనా కర్మ నుండి తప్పించుకోవడం అసాధ్యం.

అందుకే...

మంచి కర్మ చేయండి...

మంచిగా జీవించండి...

జీవితాన్ని ప్రేమించండి.

అప్పుడు మాత్రమే మన జీవితానికి నిజమైన అర్థం వస్తుంది.మనిషిగా..మానవ జన్మ పొందినందుకు సృష్టికర్త సంతోషిస్తాడు.

## వైద్యుడిపై దాడి, గొలుసు చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్

**మన దునియా,కరీంనగర్ జిల్లా: మార్చి13**




వైద్యుడిపై దాడి, గొలుసు చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్ కరీంనగర్ జిల్లాలో ఆర్ఎంపి వైద్యుడిపై దాడి చేసి గొలుసును దొంగలించిన కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. కరీంనగర్ సిపి గౌస్ సలాం తెలిపిన వివరాల ప్రకారం, గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు, తిమ్మాపూర్ మండలం నూస్తులాపూర్ గ్రామానికి చెందిన ఒక యువకుడు, పెద్దపల్లి జిల్లా బొట్ల వనపర్తి గ్రామానికి చెందిన ఒక యువకుడు, మరియు ఒక మైనర్ బాలుడు ఈ నేరానికి పాల్పడ్డారు. వీరు గతంలో కరెంటు మోటార్ల దొంగతనం కూడా చేసినట్లు సిపి తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన పోలీసులను సిపి అభినందించారు.

మన దునియా
RNI Number TTITTI/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం

## డాక్టర్ లేదని గర్భిణీని వేములవాడ ఆసుపత్రిలో చేర్చుకోకుండా బయటకు పంపిన సిబ్బంది

**మన దునియా,వేములవాడ: మార్చి13**



వేములవాడ ఏరియా ఆసుపత్రి సిబ్బంది నిర్వాకం రుద్రంగి గ్రామానికి చెందిన గౌతమి అనే గర్భిణీకి 9 నెలల 4 రోజులు కావడంతో, ఇబ్బందిగా ఉన్నందున 108 వాహనంలో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లిన కుటుంబసభ్యులు గైనకాలజిస్ట్ డాక్టర్ అందుబాటులో లేదని, గర్భిణీ మహిళను ఆసుపత్రిలోకి చేర్చుకోకుండా బయటకు పంపిన నర్సింగ్ సిబ్బంది అత్యవసర సేవలను అందించాల్సిన ఏరియా ఆసుపత్రిలో, 9 నెలల గర్భిణీని బయటకు పంపడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన బంధువులు వేరే 108 వాహనంలో సిరిసిల్ల జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలింపు వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో గత నెల రోజుల నుండి గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు.

## మావల ఎస్ హెచ్ ఓ గా శిక్షణ ఐపిఎస్ రాహుల్ కాంత్.

**శిక్షణలో భాగంగా మూడు నెలల పాటు మావల ఎస్ హెచ్ ఓ గా బాధ్యతల నిర్వహణ.**

**పూల మొక్క అందజేసి స్వాగతం పలికిన మావల సీఐ కర్రె స్వామి**

**మన దునియా,ఆదిలాబాద్ జిల్లా: మార్చి 13**




ఐపీఎస్ శిక్షణలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాకు విచ్చేసిన శిక్షణ ఐపీఎస్ రాహుల్ కాంత్ మూడు నెలల పాటు మావుల ఎస్హెచ్ఓ గా విధులు నిర్వహించనున్నారు. మావల మండల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నివారించడం, పోలీసు విధులను చేపట్టడం, ప్రజల ధన, మాన, ప్రాణాలు కాపాడడం లాంటి చర్యలను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మావల సీఐ కర్రె స్వామి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.

## తెలంగాణ పోలీసు శాఖలో భారీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

**మన దునియా,హైదరాబాద్: మార్చి13**




తెలంగాణ పోలీసు శాఖలో భారీ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగులకు పోలీసు శాఖ శుభవార్త చెప్పింది. పోలీస్ విభాగంలో యేటా పెరుగుతున్న ఖాళీలను భర్తీ చేయడానికి త్వరలోనే భారీగా ఉద్యోగాల నోటిఫికేషన్ జారీ చేయనుంది. 2026 ఫిబ్రవరి నెలాకరు నాటికి ఆ శాఖలో దాదాపు 17 వేలకుపైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు పోలీస్ శాఖ ప్రభుత్వానికి నివేదించింది. మొత్తం పోస్టులు 95,361 ఉండగా, ప్రస్తుతం 77,369 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. దాదాపు 17,992 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పోలీసు ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ క్లిష్టంగా, సుదీర్ఘంగా సాగుతుంది. ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించింది. ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తే భారీగా నియామకాలు చేపట్టే అవకాశం ఉంది.

## పరీక్షలను ఒత్తిడిగా కాకుండా, అవకాశంగా భావించండి

**-కొత్తగూడ సర్పంచ్ భాగ్యమ్మ**

**మన దునియా,?కొత్తగూడ మహబూబాబాద్ జిల్లా:మార్చి 13**



రేపటి నుండి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో, విద్యార్థులందరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కొత్తగూడ సర్పంచ్ భాగ్యమ్మ పిలుపునిచ్చారు. మండల కాంగ్రెస్ పార్టీ తరపున విద్యార్థులందరికీ ఆమె తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ?ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.... పరీక్షలను భయంగా చూడకుండా, మీ జ్ఞానాన్ని మరియు ప్రతిభను ప్రదర్శించే ఒక గొప్ప అవకాశంగా భావించాలని, అనవసరమైన టెన్షన్ పడకుండా ప్రశాంతమైన మనసుతో పరీక్షలకు హాజరు కావాలి. సానుకూల దృక్పథం ఉంటే మంచి ఫలితాలు వాటంతట అవే వస్తాయని అన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి, తల్లిదండ్రుల ఆశలు మరియు ఆకాంక్షలను నెరవేర్చాలని ఆమె కోరారు. అలాగే మంచి మార్కులతో ఉత్తీర్ణులై భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ?పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, విద్యార్థులు కూడా సమయపాలన పాటిస్తూ ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

# బూర్గులను మరిచిపోయారా సారు..


**బూర్గుల రామకృష్ణారావు జయంతిని మరిచిన నాయకులు..**

**షాద్ నగర్ లో బోసిపోయిన విగ్రహం..**

**తెలంగాణ తొలి ముఖ్యమంత్రికి అవమానం**

**మన దునియా,షాద్ నగర్:మార్చి 13**

బూర్గుల అంటే ఒక పేరు కాదు బ్రాండ్.. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా, 14 భాషలలో కోవిదుడుగా, కవిగా, స్వతంత్ర పోరాట యోధుడిగా, రక్షిత కౌలుదారు చట్టం ద్వారా నిరుపేదలకు భూములు పంచిన సేవకుడిగా బహుముఖ ప్రజ్ఞ ఆయన సొంతం. ఆయన ఫరూక్ నగర్ మండలం బూర్గుల గ్రామ నివాసి కావడం ఇక్కడి ప్రజల అదృష్టం. కానీ ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ఆయనను గుర్తు చేసుకుని నాయకులు, కులాల వారీగా నివాళులు అర్పించడం అలవాటు చేసుకున్న ప్రజా సంఘాలు బూర్గుల రామకృష్ణారావును మరిచిపోయాయి. కనీసం కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఈ మహా నాయకుడిని ఆ పార్టీ నాయకులు కూడా గుర్తుంచుకోలేదు. ఆయన జయంతిని పురస్కరించుకొని కనీసం ఒక పూలదండ వేసి నివాళులు కూడా అర్పించలేదు. బూర్గుల అభిమానులు ఇది ఆయనకు జరిగిన అవమానంగా భావిస్తున్నారు. ఎన్నికలు వస్తే తప్ప దేశానికి సేవ చేసిన మహా నాయకులు ఇప్పటి నాయక గణాలకు గుర్తురారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన బ్రాహ్మణుడు అయినప్పటికీ దళితుల భూముల కోసం పోరాడిన మహా వ్యక్తి. కనీసం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కూడా ఆయనకు నివాళులు అర్పించకపోవడం శోచనీయం. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కూడా కూతపెట్టు దూరంలో ఉంటుంది అయినా కూడా అధికార పార్టీ నాయకులు కూడా ఎక్కడ నివాళి అర్పించిన దాఖలాలు లేవు..



## విడాకుల తర్వాత హీరోయిన్ హన్సిక తొలి స్పందన



సినీ హీరోయిన్ హన్సిక మోత్వానీ తన వైవాహిక జీవితానికి ముగింపు పలికిన సంగతి తెలిసిందే. తన మిత్రుడు సోహైల్ కతూరియాను 2022 డిసెంబర్‌లో ఘనంగా వివాహం చేసుకున్న హన్సిక, కేవలం నాలుగేళ్లకే ఆ బంధానికి ముగింపు పలికారు. వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో గత కొంతకాలంగా విడిగా ఉంటున్నారు. మార్చి 11న కోర్టు వీరికి అధికారికంగా విడాకులు మంజూరు చేసింది.విడాకుల అనంతరం హన్సిక సోషల్ మీడియాలో పెట్టిన మొదటి పోస్ట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పంజాబీ భాషలో 'చార్దీ కలా..' అనే పదాన్ని ఆమె ఎక్స్ వేదికగా షేర్ చేశారు. ఏలాంటి కష్టకాలంలోనైనా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా, ఎప్పుడూ ఉత్సాహంతో నిరంతరం ముందుకు సాగాలని దీని అర్థం. జీవితంలో ఎదురైన చేదు జ్ఞాపకాలను పక్కన పెట్టి, కొత్త ఆశలతో ఆమె తన ప్రయాణాన్ని కొనసాగించబోతున్నట్లు ఈ పోస్ట్ ద్వారా స్పష్టమవుతోంది.గతంలో వీరి వివాహ వేడుకను ఒక డాక్యుమెంటరీ సిరీస్‌గా కూడా విడుదల చేశారు. అయితే గతేడాది నుంచే వీరిద్దరూ విడిపోతున్నట్లు వార్తలు వచ్చాయి. హన్సిక తన సోషల్ మీడియా ఖాతాల నుండి పెళ్లి ఫొటోలను తొలగించడంతో ఈ పుకార్లు మొదలయ్యాయి. ఇప్పుడు చట్టబద్ధంగా విడాకులు రావడంతో ఆమె తిరిగి తన సినీ కెరీర్‌పై పూర్తి దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com